

నిందితుడి అరెస్టు 8లో

పలు చోరీలకు పాల్పడిన నిందిడితుడిని చోడవరం పోలీసులు అరెస్టు చేశారు. చోరీ సొత్తు రికవరీ చేశారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామి కి వైభవంగా ఆర్జితసేవలు జరిగాయి. నిత్య కల్యాణం, గరుడు సేవ నిర్వహించారు.



విశాఖపై ఎనలేని ప్రేమ

విశాఖతో ప్రజా గాయకుడు గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ప్రకృతి రమ ణీయతకు ఎంతో ముగ్ధులయ్యే వారు. 8లో

న్యూస్‌రీల్

నేడు కూనవరంలో సీఎం జగన్ పర్యటన



సాక్షి, పాడేరు/చింతూరు/కూనవరం: ఇటీవల వరదముంపునకు గురైన అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- ఉదయం 10.25కు కోతులగుట్ట హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.30 నుంచి 10.50 వరకు ఇటీవల వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.55కు కోతులగుట్టలో బయలుదేరి 11.10కు కూనవరం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటారు.
- 11.10 నుంచి మధ్యాహ్నం 12.40 వరకు కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుంటారు.
- 12.45కు బయలుదేరి 1.00కు కోతులగుట్ట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం 1.05కు బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళతారు.

10న తాండవ నీరు విడుదల



మాట్లాడుతున్న స్వామినాయుడు

నాతవరం: తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు భూములకు ఈనెల 10న నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు డీఈ జె.స్వామినాయుడు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే మేజరు ప్రాజెక్టుగా పేరుగాంచిన తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్ సీజన్‌లో సాగుకు నీరు విడుదల చేసేందుకు ప్రజాప్రతినిధులు, రైతులు అభీష్టం మేరకే ముహూర్తం ఖరారు చేశామన్నారు. తాండవ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 370.2 అడుగుల నీరు ఉందన్నారు. తాండవ రిజర్వాయర్ ఆధారంగా నర్సీపట్నం, పాయకరావుపేట,తుని, ప్రత్తిపాడు నియోజక వర్గాల పరిధిలో సుమారు 51,465 ఎకరాల్లో వరి సాగు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఈనెల 10న తాండవ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్టు డీఈ తెలిపారు.

సభలు, సమావేశాలు నిర్వహించ వద్దు

అనకాపల్లిటౌన్: రాజకీయపార్టీల నేతలు సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుయాక్టు 1861 అమలులో ఉందని, ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. యాక్టును అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్ వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన

తుమ్మపాల: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్ వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించనున్నట్టు జిల్లా చేనేత,జౌళి శాఖ అధికారి మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికులను సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు. 'మై హ్యాండ్‌లూమ్ మై ప్రైడ్, చేనేత వస్త్రాలు వాడండి.. చేనేతకు చేయూతనివ్వండి అనే నినాదంతో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అందరు చేనేత వస్త్రాలను వినియోగించాలని కోరారు.

శ్మశానవాటికలో స్నేహితుల దినోత్సవం



శ్మశాన వాటికలో కేక్‌కట్ చేస్తున్న యువకులు

మునగపాక: మృతిచెందిన స్నేహితులను గుర్తు చేసుకుంటూ మండలంలోని గణపర్తి శ్మశానవాటికలో ఆగ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. గణపర్తి బాలాజీ నగర్‌కు చెందిన దుంగల అప్పారావు చనిపోయి ఏడాది అయింది. ఆరు నెలల తరువాత మరో స్నేహితుడు వేపాదుల అప్పారావు మృతిచెందాడు. దీంతో తోటిస్నేహితులు తట్టుకోలేకపోయారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా రోలుగెడ్డను ఆనుకొని ఉన్న అనధికారిక శ్మశానవాటికలో వారివురి పేరున కేక్‌కట్ చేసి గత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. పొనమాళ్ల సూరిప్రకాష్,యల్లపుకొండ, మామిడి శ్రీనివాస్, యల్లబిల్లి దేముడు,కోరిబిల్లి కృష్ణ, గొందిరవి. దుర్గ,రాజు,అప్పలనాయుడు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న సేవాలయ సౌధాలు

- సచివాలయ భవన నిర్మాణాలకు రూ.398.79 కోట్లు
- కాంట్రాక్టర్లకు బకాయిలు లేకుండా చెల్లింపులు
- సెప్టెంబర్ నాటికి భవనాలు సిద్ధం



ప్లాస్టింగ్ పూర్తయిన వైఎస్సార్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రం



నిర్మాణ దశలో ఉన్న రైతు భరోసా కేంద్రం



పూర్తయిన సచివాలయ భవనం

తుమ్మపాల: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాలకు అతి త్వరలో నూతన భవనాలు అందుబాటులోకి రానున్నాయి. పల్లె ప్రజల జీవన స్థితిగతులు మరింత మెరుగు పరిచి వారికి అన్ని సౌకర్యాలు వారి పల్లెల్లోనే కల్పించాలనే లక్ష్యంతో ప్రతి పల్లెలోను నూతన సచివాలయ భవనంతో పాటు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ అండ్ వెల్‌నెస్ భవనం, మరికొన్ని భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఈ భవనాల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పలు సాంకేతిక కారణాలతో బిల్లులు విడుదలలో జరుగుతున్న జాప్యాన్ని నివారించింది. పూర్తి చేసిన పనులకు అనుగుణంగా బిల్లులను ఎప్పటికప్పుడు(అప్‌లోడ్ చేసిన వెంటనే) విడుదల చేస్తోంది. ఇందుకు సంబంధించి గత నెల మూడవ వారంలో రూ.189 కోట్లను విడుదల చేసింది. నిధుల కొరత లేకపోవడంతో బిలో బేస్‌మెంట్ లెవెల్, బేస్‌మెంట్ లెవెల్, రూఫ్ లెయిడ్, సెకండ్ శ్లాబ్, ఫినిషింగ్, ఫిజికల్లీ కంప్లీటెడ్ దశలుగా విభజించి, వీటిని అత్యంత ప్రాధాన్యతగా స్వీకరించి సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

1,338 భవనాలకు రూ.398.79కోట్లు

జిల్లాలో 26 మండలాల్లో ఉన్న సచివాలయాల్లో 1,338 సచివాలయాలకు నూతన భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.398.79 కోట్లు వెచ్చిస్తోంది. పనులు ఎంబుక్‌లో నమోదైన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నారు. ఇప్పటికి మొత్తం రూ.239 కోట్ల మేర కాంట్రాక్టర్లకు చెల్లించారు. వివిధ స్థాయిల్లో ఉన్న పనులకు ప్రతి వారం బిల్లులు క్రమంగా చెల్లిస్తున్నారు.

ప్రతివారం సమీక్ష

ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతికి సంబంధించి ప్రతి శనివారం జిల్లాల అధికారులతో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తున్నారు. సీఎస్ సమీక్ష అయిన వెంటనే కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆయా ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ...పురోగతిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. నిర్మాణాల్లో వేగం తగ్గితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. భవన నిర్మాణాలకు ఎలాంటి నిధుల కొరత లేనందున ఆయా భవనాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కాలపరిమితి విధించింది.

జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాల వివరాలు

వివిధ దశలు	సచివాలయాలు	ఆర్బీకేలు	వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
రూఫ్ లెవల్	17	78	83
శ్లాబ్ లెయిడ్	47	47	52
ఫినిషింగ్	83	82	73
కంప్లీటెడ్	301	168	97

సెప్టెంబర్ నాటికి 90 శాతం పూర్తి

సచివాలయాలు, ఆర్బీకే, హెల్త్, వెల్‌నెస్ భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పనులు నమోదు చేసిన వెంటనే ప్రతి వారం బిల్లులు చెల్లిస్తున్నాం. సెప్టెంబర్ 30 నాటికి జిల్లాలో 90 శాతం భవనాలు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టార్గెట్ పెట్టుకున్నాం. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం లేదు. దీంతో యుద్ధప్రాతిపతికన పనులు జరుగుతున్నాయి.

– ఎస్.బి. నాయుడు, ఈఈ, జిల్లా పంచాయతీరాజ్ శాఖ

హింసను ప్రేరేపించేందుకే బాబు పర్యటనలు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలనే దురుద్దేశంతోనే ప్రాజెక్టుల సందర్శన పేరిట చంద్రబాబు పర్యటనలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రగిలిస్తూ, ఎక్కడికక్కడ టీడీపీ గూండాలను రెచ్చగొట్టి పోలీసులపైన, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ఉసి గొల్పుతున్నారని ధ్వజమెత్తారు. రాజకీయంగా పాతాళానికి తొక్కేసిన రాష్ట్ర ప్రజలపై యుద్ధం ప్రకటించారని, అధికారం కోసం బరితెగిస్తూ రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చాలని తాపత్రయ పడుతున్నారన్నారు. పుంగనూరు ఘటనతో కుట్రలు, కుతంత్రాలు పరాకాష్టకు చేరాయని, వీధి రౌడీలా వ్యవహరిస్తున్న బాబు తీరును చూసి ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు.చంద్రబాబు డైరక్షన్‌లోనే ఇతర నియోజకవర్గాల నుంచి రప్పించిన కిరాయి గూండాలు, పచ్చ మూకలు పోలీసులపై దాడులకు తెగబడ్డారన్నారు. కుప్పంలో ఓటమి భయంతోనే చంద్రబాబు విధ్వంసాలకు తెరలేపారని విమర్శించారు. హింసాకాండకు కారకుడైన చంద్రబాబును ఏ1గాచేర్చి తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. హత్యా రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. పోలీసులపై దాడులు చేస్తే సహనం కోల్పోయి జరిపే కాల్పుల్లో మరణించిన వారితో శవ రాజకీయాలు చేయాలని చూసిన దుర్మార్గుడు చంద్రబాబని విమర్శించారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి హత్యా రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు,వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ వరదపురెడ్డిసింహాచలంనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబును అరెస్టు చేయాలి

- చిత్తూరు జిల్లా పుంగనూరులో హింసను ప్రేరేపించిన బాబు
- ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

మునగపాక: చిత్తూరు జిల్లా పుంగనూరులో హింసను ప్రేరేపించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై ఏ-1 నిందితుడిగా కేసు నమోదుచేసి అరెస్టు చేయా లని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న చంద్రబాబునాయుడుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రా నున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని గుర్తించిన చంద్రబాబు ఏదోలా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేందుకు కుట్రలు, కుతంత్రా లు పన్నుతున్నారని విమర్శించారు. పుంగనూరు ఘటనలో 40 మంది పోలీసులపై దాడులకు ప్రేరేపించిన చంద్రబాబును ఉపేక్షించరాదని తెలి పారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ కుతంత్రాలకు పాల్ప డడం చంద్రబాబుకు తగదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని తెలిపారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. పాదయాత్ర పేరుతో తన కొడుకు లోకేష్, వారాహి యాత్ర పేరుతో దత్తపుత్రుడు పవన్‌ను తిప్పుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబు కుట్రలకు తెరతీస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా రాను న్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి సీఎం కావడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక, మూలపేట సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు,భీశెట్టి గంగప్పలనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,నాగేశ్వరరావు, బాబూరావు, యువజన విభాగం నాయకుడు నరాలశెట్టి సూర్యనారాయ ణ, దోసూరు సర్పంచ్ నర్మాలరామకృష్ణ పాల్గొన్నారు.

యువకుడిపై కొండచిలువ దాడి



చికిత్స కోసం యువకుడిని డోలీలో మోసుకొస్తున్న గిరిజనులు



పరీక్షిస్తున్న వైద్యురాలు అనీష

మింగేస్తుండగా కేకలు వేయడంతో వదిలేసిన సర్పం

కోటవురట్ల: కొండచిలువ బారి నుంచి ఓ గిరిజన యువకుడు తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి చెందిన సీందిరి చిట్టిబాబు ఆదివారం కొండపైకి వెళ్లి కట్టెలు సేకరించాడు. వాటిని మోపు కట్టేందుకు తాడు కోసం ఓ చెట్టు తొక్క తీస్తుండగా తుప్పల్లో ఉన్న కొండచిలువ చిట్టిబాబు ఎడమ కాలు పట్టుకుని మింగేందుకు ప్రయత్నించింది. దీంతో కేకలు వేయగా అక్కడకు దగ్గరలో ఉన్న రాంబాబు, శ్రీరామ్ చూసి భయంతో పారిపోయారు. వీరి కేకలు విన్న మరో యువకుడు నర్సింగరావు పరుగున వస్తూ గట్టిగా కేకలు వేయడంతో అప్పటికే మోకాలు వరకు మింగేసిన కొండచిలువ చిట్టిబాబును వదిలేసి తుప్పల్లోకి వెళ్లిపోయింది. వెంటనే గ్రామానికి చెందిన యువకులతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి జి.డేవిడ్‌రాజ్ చిట్టిబాబును డోలీలో మెయిన్‌రోడ్డు వరకు మోసుకొచ్చి అక్కడి నుంచి ఆటోలో కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. చిట్టిబాబును డాక్టర్ అనీష పరీక్షించారు. పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తామని ఆమె తెలిపారు. ప్రాణాపాయం లేదని చెప్పారు.

బాబువి శవ రాజకీయాలు



శవరాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. బాబు తీరును నిరసిస్తూ అనకాపల్లిలో భారీ బైక్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. -8లో

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- 'అమృత్ భారత్'లో రూ.27.1 కోట్లతో అభివృద్ధి
- ఎంపీ భీశెట్టి సత్యవతి
- పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, చిత్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న ఎంపీ భీశెట్టి సత్యవతి

అనకాపల్లి టౌన్: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అనకాపల్లి రైల్వే స్టేషన్ దిశ మారనున్నదని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తెలిపారు. ఈ పథకంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధిలో పనులకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వేకి చిట్టచివరగా ఉన్న జిల్లాలో ప్రధానమైన అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను రూ.27.1కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకంలో తొలి విడత రాష్ట్ర వ్యాప్తంగా 11 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పాత పుట్‌పాత్ బ్రిడ్జిని తొలగించి 13 అడుగుల పుట్‌పాత్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రస్తుతమున్న ప్లాట్‌ఫాంలను ఆధునికీకరించి, స్టేషన్‌లో సీసీ కెమెరాలు, ప్రయాణికులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు. బొజ్జన్నకొండ, బెల్లం మార్కెట్, ఏటికొప్పాక లక్కబొమ్మలు వంటి ప్రదర్శనలు అనకాపల్లి స్టేషన్‌లో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. జీ 20 దేశాల సదస్సును మనదేశంలో ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. అమెరికా వంటి అగ్రరాజ్యాలతో భారతదేశం అభివృద్ధిలో పోటీ పడుతోందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీల సమన్వయంతో పనిచేస్తోందని చెప్పారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.5 కోట్లతో ఇంక్యూబేషన్ సెంటర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్సీ పి.రఘువర్మ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పలు అంశాల్లో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 508 స్టేషన్లు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. అంతకుముందు రైల్వే స్టేషన్‌లో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎంపీ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, అడిషనల్ క్రైం ఎస్పీ సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.వి.వి.సత్యనారాయణ, విజయవాడ డివిజన్ రైల్వే సీనియర్ అధికారి శ్రీనివాసరావు, అనకాపల్లి స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎగబాకుతున్న ఎయిర్ కార్గో!



విశాఖ ఎయిర్‌పోర్టులో విమానంలోకి కార్గో రవాణా చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులతో పాటు సరకు రవాణాలోనూ ఎగబాకుతోంది. కోవిడ్ ప్రభావంతో రెండేళ్లకు పైగా కార్గో రవాణా సన్నగిల్లింది. కానీ కొన్నాళ్ల నుంచి దానిని అధిగమిస్తూ మళ్లీ ఇది ఊపందుకుంటోంది. కోవిడ్‌కు ముందు నాటి పరిస్థితులకు చేరుకుంది. ఈ ఎయిర్‌పోర్టు నుంచి కోవిడ్ సమయంలో రోజుకు ఏడెనిమిది టన్నుల సరకు రవాణా జరగడం కష్టతరంగా ఉండేది. ఆ పరిస్థితి నుంచి ఇప్పుడు రోజుకు సగటున 13 నుంచి 15 టన్నుల వరకు రవాణా అవుతోంది. ఏటా జనవరినుంచి ఆగస్టు దాకా రొయ్యలు, రొయ్య పిల్లల ఎగుమతి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఒక్కోసారి రోజు 20–22 టన్నులకు చేరుకుంటుంది. ఉదాహరణకు గత మార్చిలో 532 ట న్నులు (సగటున రోజుకు దాదాపు 18 టన్నులు), మే నెలలో 507 టన్నులు (రోజుకు 17 టన్నులు) చొప్పున సరకు రవాణా అయింది. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరకు రవాణా జరుగుతోంది. వీటిలో రొయ్యలు, రొయ్య పిల్లలతో పాటు ఫార్మాఉత్పత్తులు, అత్యవసర మందులు, దుస్తులు,ఆటోమొబైల్స్,నావికాదళానికి సంబంధించిన వస్తువులు, సరకులు, పరికరాలతో పాటు ఇతర సాధారణ సరకు కూడా రవాణా అవుతోంది. వీటిలో అధిక శాతం రొయ్యలు, ఫార్మా ఉత్పత్తులదే సింహభాగం. జనవరి–ఆగస్టు వరకు కొనసాగే ఆక్వాసీజనులో రోజుకు 150–200టన్నుల వరకు వీటి ఎగుమతులే ఉంటాయి. అలాంటి సమయంలో వీటి రవాణాకోసం ఎయిర్‌పోర్టు అధికారులు ప్రత్యేక అనుమతులు తీసుకుంటున్నారు. ఆ తర్వాతస్థానంలోటెక్స్‌టైల్స్,ఆటోమొబైల్స్‌ఉంటున్నాయి.

ఔట్‌సోర్సింగ్‌కు కార్గో రవాణా..

మరోవైపు ఎయిర్ కార్గో రవాణాను ఔట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకోసం ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ టెండర్లను కూడా పిలిచింది. ఫైనల్ బిడ్‌ను కూడా తెరిచారు. టెండరును ఖరారు చేస్తే ఔట్‌సోర్సింగ్‌లో ఎయిర్ కార్గో ప్రక్రియను టెండరు దక్కించుకున్న సంస్థ చేపడుతుంది. ఈ ఔట్‌సోర్సింగ్ విధానంలో సరకు రవాణాలో వచ్చే మొత్తంలో కొంత సొమ్మును ఎయిర్‌పోర్టు అథారిటీకి చెల్లిస్తారని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. ఈ విధానం అందుబాటులోకి వస్తే ప్రస్తుతం డొమెస్టిక్ కార్గోకే పరిమితమైన సరకు రవాణా.. కొన్నాళ్ల తర్వాత ఇంటర్నేషనల్ కార్గో రవాణాకు వీలవుతుందని తెలిపారు. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా కోవిడ్‌కు ముందునాటి పరిస్థితిని అధిగమించే అవకాశం ఉందని ఎయిర్‌పోర్టు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

‘ఉన్నతాధికారుల వేధింపులు అవాస్తవం’


లక్ష్మన్న

గొలుగొండ: జిల్లా, డివిజన్ అటవీ శాఖ అధికారుల నుంచి దిగువ స్థాయి సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేవని, కావాలని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర అటవీ శాఖ జూనియర్ ఫారెస్టు ఆర్గనైజేషన్ కమిటీ కార్యదర్శి, గొలుగొండ సెక్షన్ అధికారి ఆర్ లక్ష్మన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఫారెస్టు అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఇటీవల కొన్ని పత్రికల్లో (సాక్షి కాదు) వచ్చిన వార్తలో నిజం లేదన్నారు. జిల్లా, డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పని చేస్తున్నామన్నారు. ఎక్కడా వేధింపులు, డబ్బులు కోసం ఇబ్బందులు పెట్టడం లేదని తెలిపారు. కావాలని కొంతమంది ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

యువకుడు అదృశ్యం

కశింకోట: స్థానిక కస్పావీధికి చెందిన అలకంశెట్టి అజయ్ అనే యువకుడు అదృశ్యమైనట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. గత నెల 31న మందలించడంతో అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. అజయ్ డిగ్రీ 2వ సంవత్సరం చదువుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభకు పురస్కారాలు


విద్యార్థులను సత్కరిస్తున్న అతిథులు

పాయకరావుపేట: ఆంగ్ల, తెలుగు వక్తృత్వ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపి పురస్కారాలు అందుకున్నారు. అమృత్ భారత పథకంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వే డివిజన్ పరిధి తునిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.రోహన్ మధుకర్, ఎస్.భవ్య (9వ తరగతి) ఆంగ్ల వక్తృత్వం, జి.కృష్ణ చందన (10వ తరగతి) తెలుగు వక్తృత్వం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఆదివారం తుని రైల్వే స్టేషన్‌లో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విజయవాడ రైల్వే నోడల్ ఆఫీసర్ మునిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విజేతలను శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, హెచ్ఎం బి.సీతారాణి అభినందించారు.

బాబువి శవరాజకీయాలు



నిరసన ర్యాలీగా బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్
- పుంగనూరు ఘటనపై అనకాపల్లిలో నిరసన, మానవహారం

అనకాపల్లిటౌన్: శవరాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. చంద్రబాబును తీరును నిరసిస్తూ ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంప్ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి ప్రసాద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పుంగనూరు ఘటనకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పుంగనూరులో చంద్రబాబునాయుడు 40మంది పోలీసులపై టీడీపీ నేతలచే దాడులు చేయించారని తెలిపారు. అక్కడ ఘర్షణ వాతావరణం సృష్టించడంతోపాటు ప్రజలపై కాల్పులు జరిపేలా చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా చేయడం అమానుషమని చెప్పారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు శాంతియుతంగా వ్యవహరించారని తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీనవర్గాల కోసం రూ.2లక్షల 50వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశారని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదిస్తారని గ్రహించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తక్షణమే చంద్రబాబుపై ఎ1గా కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకి మతిభ్రమించిందని, అధికారం కోసం పాకులాడుతున్నట్లు ఆయన చెప్పారు. రాజకీయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొలేకనే బాబు కుట్రలు పన్నుతున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయిందని, ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో చంద్రబాబుకు భయంపట్టుకుందని విమర్శించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ చంద్రబాబుకు అధికారం లేకపోవడంతో రాష్ట్ర ప్రజలపై కోపం పెంచుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లా వ్యవసాయ రైతు సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు అయోమయంలో పడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాంద్రేగుల విష్ణుమూర్తి, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షురాలు మర్రిపల్లి శోభ, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు కలగా గున్నయ్యనాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు సుజాత, పార్టీ శ్రేణులు దాసరి అప్పారావు, కొరుప్రోలు చిన్నారావు, ఆడారి అచ్చియ్యనాయుడు, మలసాల కిశోర్, నీటిపల్లి లక్ష్మి, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి మడ్డు శ్రీను


ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి మడ్డు శ్రీనును సత్కరిస్తున్న మండల కమిటీ

రోలుగుంట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ పని చేస్తోందని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, ప్రధాన కార్యదర్శి మడ్డు శ్రీను తెలిపారు. మండల నాయకత్వం ఆధ్వర్యంలో ఆదివారం రోలుగుంటలో వారిని మండలాధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు జె.సాంబశివరావు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని మండల కమిటీకి సూచించారు. ఏ ఒక్కరినీ యూనియన్‌లో చేరాలని బలవంతం చేయొద్దన్నారు. ముందు ఎవరికైతే సమస్య వచ్చిందో తెలుసుకుని వారి వద్దకు వెళ్లి పరిష్కరించాలన్నారు. తర్వాత వారే సంఘ సభ్యులుగా చేరుతారన్నారు. అంతేకాని ఏ ఒక్కరినీ సభ్యులుగా చేరాలని ఇబ్బంది పెట్టడం, వారి పనులకు ఆటంకం కలిగించడం నాయకత్వ లక్షణం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడ్డిగ అప్పారావు, మండల నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

14తులాల బంగారు నగలు, రూ.9వేల నగదు స్వాధీనం


నిందితుడు గార్ల రమేష్

చోడవరం రూరల్: పట్టణంలోని ఎనిమిది ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. చోడవరంలో కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న గార్ల రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు ఆదివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని దుడ్డువీధికి చెందిన గార్ల రమేష్ కార్పెంటర్ వృత్తి చేస్తున్నాడు.జల్సాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లలో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడ్డాడు. పట్టణంలోని దుడ్డువీధిలో రెండు ఇళ్లలో, బాలాజీనగర్, గునిశెట్టివారివీధి, విద్యానగర్, అన్నదానపువారి వీధి, వ్యాపారవీధి, బుక్కవీధిల్లోని ఒక్కో ఇంటిలో కలిపి మొత్తం ఎనిమిది ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్టు సీఐ చెప్పారు. చీడికాడ రోడ్డులో దుర్గా కాలనీ వద్ద మధ్యవర్తుల సమక్షంలో శనివారం సాయంత్రం నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు. రమేష్ నుంచి 14తులాల బంగారు ఆభరణాలు, రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకుని జుడిషియల్ కస్టడీకి తరలించినట్టు సీఐ తెలిపారు.

రైతులకు మేలు చేసేలా ప్రభుత్వ సేవలు

- సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: మారుతున్న కాలంతోపాటు రైతులు వ్యవసాయ విధానాల్లో మార్పులు చేసుకోవాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని మూలపేటలో ఆదివారం రైతు దేవోభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుకాలం కష్టపడి పనిచేసే రైతులకు మంచి రోజులు వస్తున్నాయన్నారు. ఆర్బీకేల ఏర్పాటుతో మండల కేంద్రాల్లో గిడ్డంగులు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. రైతులను ఆదుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతుల్లో మరింత ఉత్సాహం వస్తుందన్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ రైతులను ఆదుకుంటేనే ఆహార సమస్య తలెత్తదన్నారు. రైతే దేశానికి వెన్నుముఖగా పేర్కొన్నారు. అనంతరం ట్రస్ట్ ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు విశ్వేశ్వరరావును ఘనంగా సత్కరించారు. పెంటకోట వెంకటరావు, ఆడారి కిశోర్‌కుమార్, సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, ట్రస్ట్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బుచ్చింపేటలో ప్లాస్టిక్ రైస్ కలకలం


పేపరుపై వేసిన సాధారణ రైస్, ప్లాస్టిక్ రైస్

రోలుగుంట: మండలంలోని బుచ్చింపేటలో ఒక షాపులో ప్లాస్టిక్ రైస్ విక్రయిస్తున్నట్టు కలకలం రేగింది. గ్రామానికి చెందిన కొనుగోలుదారుడు ఇక్కడ ఒక షాపులో బియ్యం కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. ఆ బియ్యంలో తేడా గమనించి పొరుగువారిని పిలిచి చూపించాడు. ఇవి ప్లాస్టిక్ బియ్యంలా ఉన్నాయని చెప్పడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి ఫోర్టిఫైడ్ బియ్యమని సదరు వ్యాపారి చెప్పడంతో వారిలో అలజడి తగ్గింది. ఇలాంటి బియ్యంలో వస్తున్న తేడాలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించకపోతే సమస్యలు ఉత్పన్నమవుతాయని వాపోతున్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన రామకృష్ణ

- గుండెమార్పిడి చికిత్స కోసం విరాళాల సేకరణ
- ఇంతలో నిరుపేద కుటుంబంలో విషాదం



మునగపాక: తమ కుమారుడు బతకాలని ఎంతో మంది దేవుళ్లను కొలిచారు. ఎన్నో ఆస్పత్రుల్లో చూపించారు. చివరికి గుండె మార్పిడి శస్త్రచికిత్సకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సాయం కోరారు. ఇంతలో మృత్యువుతో పోరాడి ఓడిపోయిన అతడు కన్నుమూశాడు. దాంతో తన తల్లిదండ్రులకు గుండె కోత మిగిలింది. హృద్రోగి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్న వారికి నిరాశ ఎదురైంది. ఈ చేదు వార్త తెలియడంతో మునగపాకలో విషాదం అలుముకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన దొడ్డి శ్రీను గణేష్, పార్వతి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు రామకృష్ణ ఆర్నెల్ల క్రితం నుంచి అనారోగ్యానికి గురయ్యాడు. నయం చేయడానికి తల్లిదండ్రులు పలు ఆస్పత్రులకు తిప్పారు. చివరకు అతడికి గుండెమార్పిడి చికిత్స చేయాలని గుర్తించారు. ఆపరేషన్ చేస్తేనే బతుకుతాడని వైద్యులు తేల్చిచెప్పారు. ఇందుకోసం రూ.35 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని సూచించారు. అంత పెద్ద మొత్తం సమకూర్చి ఆపరేషన్ చేయించుకునే స్థోమత లేని రామకృష్ణ కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అయితే 20 రోజులుగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కేర్ ఆస్పత్రిలో రామకృష్ణకు వైద్యం అందిస్తున్నారు. ఎలాగైనా అతడిని బతికించుకునేందుకు గ్రామ యువత, పెద్దలు విరాళాలు సేకరించేందుకు ముందుకొచ్చారు. ఆపరేషన్‌కు అవసరమయ్యే నగదును సమకూర్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇంతలో విధి వక్రించింది. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మునగపాక గ్రామస్తులు, యువకులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇదిలా ఉండగా ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రామకృష్ణ ఆరోగ్య సమస్యను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా ప్రాణంతో కొట్టుమిట్టాడిన రామకృష్ణ ఇక లేరన్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు కంట తడి పెడుతున్నారు.

చంద్రబాబు కుట్రతోనే పుంగనూరు ఘటన

- మరోసారి జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధం
- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం: నారా చంద్రబాబునాయుడు కుట్రలో భాగంగానే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు ఘటన జరిగిందని, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడంతోనే అశాంతి నెలకొందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు విమర్శించారు. మండలంలోని కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందజేస్తూ ఆరాధ్య దైవంగా మారారన్నారు. సీఎంగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమ వర్షం కురిపించారన్నారు. తాము గ్రామాల్లో తిరుగుతుంటే బ్రహ్మరథం పట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు నైజం రాష్ట్ర ప్రజలకు తెలుసని, ఇప్పుడు కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు.

శవ రాజకీయాల్లో చంద్రబాబు సిద్ధహస్తుడు..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిని చంద్రబాబు విమర్శించే తీరు చూస్తుంటే ఎంతగా దిగజారి ప్రవర్తిస్తున్నాడో అర్థమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నాయకులకు గెలిచే సత్తా లేదన్నారు. ఈ భయంతోనే పుంగనూరులో దాడులకు ప్రేరేపించి శవ రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. రౌడీలను తెప్పించుకుని 40 మందికిపైగా పోలీసులను గాయపరచారన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత చంద్రబాబుదేనని, వెంటనే ఆయన్ను అరెస్టు చేసి రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరిచర్ల శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, సర్పంచ్‌లు మైలపల్లి శ్రీనివాసరావు, కోశెట్టి వెంకటరమణ, కొరపాటి గోపాలం, పాయకరావుపేట, ఎస్.రాయవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు రాజేష్‌ఖన్నా, అల్లాడ నాగరాజు, పార్టీ నక్కపల్లి మండలాధ్యక్షుడు శ్రీరం నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆనాటి ఆ స్నేహం ఆనంద గీతం

పెదబొడ్డేపల్లి గురుకులంలో పూర్వ విద్యార్థుల సందడి


డ్యాన్స్ చేస్తున్న పూర్వ విద్యార్థులు


ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తూ..

నర్సీపట్నం: అక్కడ పాత మిత్రులు జ్ఞాపకాలు కలబోసుకున్నారు. ఏళ్ల నాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. అప్పటి గురువులను సన్మానించుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 40 ఏళ్ల క్రితం నాటి స్నేహ బృందం కలుసుకుంది. ఆనందోత్సాహాలతో సందడి చేసింది. ఇక్కడ చదివి డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు, లాయర్లు, సాఫ్ట్ వేర్ నిపుణులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారంతా తమ పాత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. తాము జీవితంలో ఎలా ఎదిగిందీ... ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు వివరించారు. శనివారం రాత్రి ప్రస్తుత విద్యార్థులతో కలిసి తమ చదువుల ఒడిలో నిద్ర చేసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆదివారం ఉదయం వేకువజామున లేచి వారితో కలిసి వ్యాయామం చేశారు. అనంతరం స్నానాలు ఆచరించి అల్పాహారం తీసుకున్నారు. గతేడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన పూర్వ గురువు, ప్రస్తుతం బీసీ గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డిని, అప్పటి గురువు ఆనందరావు, ప్రస్తుత ప్రిన్సిపాల్ శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజీ హెచ్‌వోడీ గండి గోవిందనాయుడు, ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డివిజనల్ ఇంజినీర్ ఎల్.టి.వి. ప్రసాద్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.వి.అప్పారావు, పూతిక సూర్యనారాయణ, ఎ.రమణ, సెక్రటరీ చంటి, గోపి, సాంబశివరావు, కార్యక్రమం ఆర్గనైజర్ కుంచా వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాటి క్రమశిక్షణే.. విజయానికి సోపానం..



నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ నా విజయానికి సోపానమైంది. క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడం వల్ల ఉన్నత స్థానానికి ఎదిగాం.. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలని ఏటా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నాం.

– డాక్టర్ బి.రామచంద్రరావు, ఈఎన్‌టీ సర్జన్, పూర్వ విద్యార్థి

ఎదుగుదల ఆనందదాయకం



అల్లరి, చిల్లరిగా విద్యనభ్యసించే నాటి విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వంగా ఉంది. తమ శిష్యులను ఒకే చోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయి.

– ఎస్.వెంకటరెడ్డి, పూర్వ గురువు, ప్రస్తుత బీసీ గురుకులం ప్రిన్సిపాల్

విశాఖపై ఎనలేని ప్రేమ

- ఇక్కడ అందాలంటే అంతులేని మోజు
- బీచ్‌లో గడపడానికి ఎంతో ఆసక్తి
- చేపల కూరంటే చెప్పలేనంత ఇష్టం
- ఉక్కు ప్రైవేటీకరణపై ఉత్తేజపరిచే పాటలు
- ప్రజాకవి వంగపండును బావగా సంబోధన

– వైజాగ్‌తో గద్దర్‌కు విడదీయరాని బంధం



సాక్షి, విశాఖపట్నం: విశాఖతో ప్రజా గాయకుడు గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ప్రకృతి రమణీయతకు ఎంతో ముగ్ధులయ్యే వారు. విశాఖ వచ్చినప్పుడల్లా బీచ్‌లోనే ఎక్కువ సమయం గడపడానికి ఆసక్తి చూపేవారు. అలల అందాన్ని తనివి తీరా ఆస్వాదించేవారు. వైజాగ్‌లాగే ఇక్కడ ప్రజలు ఎంతో ప్రశాంతంగా ఉంటారని తరచూ కొనియాడేవారు. విశాఖ ప్రశాంతత చూస్తే కవిత్వం, ఉద్వేగం కలగలిసి ఉప్పొంగుతుందని తన స్నేహితులు, ఆత్మీయులతో చెప్పేవారు. విశాఖలో దొరికే తాజా చేపలతో వండే కూరంటే ఆయనకు ఎంతో ఇష్టం. అందుకే విశాఖ వచ్చినప్పుడు తాను బావగా పిలుచుకునే ప్రజాకవి వంగపండు ప్రసాదరావు ఇంట్లో తనకిష్టమైన చేపలకూరను వండించుకుని తినేవారు. ఎంతో నిరాడంబర జీవితాన్ని గడిపే గద్దర్.. వైజాగ్ వస్తే హోటళ్లలో గడపడానికి ఇష్టపడేవారు కాదు. ఎవరైనా ఆయనకు హోటళ్లలో గది బుక్ చేస్తామన్నా వద్దని, తన ప్రియమైన బావ (వంగపండు) ఇంట్లోనే ఉంటానని చెప్పేవారు. ఇక విశాఖ వచ్చినప్పుడు వంగపండుతో కలిసి గజ్జె కట్టి పాటలు పాడే వారు. తాను ఎక్కువగా వంగపండు రాసిన పాటలనే పాడతానని గద్దర్ చెప్పేవారు. 2020 ఆగస్టు 4న వంగపండు కన్నుమూయగా.. సరిగ్గా మూడేళ్ల రెండు రోజుల తర్వాత గద్దర్ తన బావ చెంతకే చేరడం యాదృచ్ఛికం!

సమ్మె నీ జన్మ హక్కురన్నో..

ఇక కార్మికుల పక్షాన పాటల రూపంలో ఉద్యమ స్ఫూర్తినిచ్చే గద్దర్ విశాఖ ప్రైవేటీకరణకు నిరసనగా గళమెత్తడమే కాదు.. ‘ఉక్కు సత్యాగ్రహం’పేరుతో నిర్మిస్తున్న సినిమాలో నటించడానికి విశాఖ వచ్చారు. సొంతంగా పాటలు రాసి.. పాడారు. ఈ సినిమా మరికొద్దిరోజుల్లో విడుదల కానున్న తరుణంలో గద్దర్ కన్ను మూయడాన్ని విశాఖ వాసులు, ముఖ్యంగా ఉక్కు కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉక్కు ఉద్యమం 900 రోజుకు చేరిన సందర్భంగా గత నెల 31న ఆయన విశాఖకు రావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ పర్యటనను రద్దు చేసుకున్నారు.

క్లుప్తంగా

గద్దర్ మృతికి సంతాపం

అనకాపల్లిటౌన్: గద్దర్ మరణం ఉభయ తెలుగురాష్ట్రాలకు తీరనిలోటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాజంలో అవినీతి, అరాచకాలు, దళిత ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రభుత్వాన్ని అడుగడుగునా హెచ్చరించారని పేర్కొన్నారు. పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ఘనత గద్దర్‌కే దక్కుతుందన్నారు.
అనకాపల్లి రూరల్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి సమాజంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరనిలోటని సీపీఎం జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కోట్లాది మంది ప్రజల్ని చైతన్యవంతులను చేయడానికి గద్దర్ తన పాటల ద్వారా అవిశ్రాంతంగా కృషి చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం తెలిపారు. ఆయన పాటలన్నీ సామాజిక సమస్యల పరిష్కారానికి, ఉద్యమాల మనుగడకు జీవం పోశాయన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలిపారు.

నేడు పట్టణానికి ఆదివాసీ పాదయాత్ర

అనకాపల్లి రూరల్: జిల్లాలో నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉంటున్న గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆదివాసీ పాదయాత్ర సోమవారం అనకాపల్లి పట్టణానికి చేరుకుంటుందని సీపీఎం సీనియర్ నేతలు ఎ.బాలకృష్ణ, ఐఆర్ గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గుండాల కూడలి వద్దకు సోమవారం ఉదయం 10.30 గంటల సమయానికి చేరుకోనున్న పాదయాత్రకు పార్టీ నేతలు, ప్రజాసంఘాల నాయకులు హాజరై ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. జిల్లా విభజన తర్వాత ఐటీడీఏ సేవలను కోల్పోయిన ఆదివాసీలకు ప్రభుత్వం ఆ సేవలను యథావిధిగా అందించాలన్న డిమాండ్‌తో చేస్తున్న పాదయాత్రకు సంఘీభావం తెలిపి, వారి పోరాటానికి మద్దతునివ్వాలని కోరారు.

ఆదివాసీల పాదయాత్రకు మద్దతు

తుమ్మపాల: ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించి, అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు కోరారు. ఆదివాసీ సాగు రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలియజేస్తూ పట్టణంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సాగులో ఉన్న భూములపై వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం నుంచి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వరకు తలపెట్టిన పాదయాత్రకు మద్దతు తెలుపుతున్నామన్నారు. సభ్యులు దొమ్మెసి సత్యారావు, ఇంటి చిన ఎల్లయ్య, నడుపూరి దేముడు, జగ్గారావు పాల్గొన్నారు.

అమృత్ భారత్ పేరిట ప్రజాధనం దుర్వినియోగం

అనకాపల్లిటౌన్: అమృత్ భారత్ పేరిట బీజేపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆప్ నేత కొణతాల హరనాథ బాబు ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఓ పక్క నిరుద్యోగం, మరోపక్క వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటున్నా కేంద్రానికి పట్టడంలేదన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మెగ్ 2	: సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్(మార్నింగ్, మ్యాట్నీ షోలు)	
దిల్‌సే	: సత్యనారాయణ స్క్రీన్-2
కృష్ణగాడు అంటే ఒకరేంజ్	: షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్	: పర్తిసాయి
ఎల్‌జీఎం(లెట్స్ గెట్ మ్యారీడ్)	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 203 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 117 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

క'న్నీటి'వెతలు తీరేలా..

- జల్ జీవన్ మిషన్‌లో కొత్త బోర్ల ఏర్పాటు
- కశింకోటకు తీరనున్న తాగునీటి కష్టాలు

మండల కేంద్రం కశింకోటలో తాగునీటి ఇక్కట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.30 లక్షలు మంజూరు కావడంతో తాజాగా రెండు బోర్లు వేశారు. వాటి ద్వారా ప్రస్తుతం ఉన్న రక్షిత మంచినీటి పథకాలకు నీరందిస్తున్నారు. దీంతోపాటు అదనంగా 500 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, మారుమూల ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


కుళాయిలకు తాగునీరు అందిస్తున్న రక్షిత మంచినీటి పథకాలు


కుళాయి నీరు ఫోర్స్‌గా రాకపోవడంతో పాత్రలో పట్టి గ్లాస్ ద్వారా బిందెలోకి సేకరణ

కశింకోట: అనకాపల్లి నియోజక వర్గంలో అనకాపల్లి తర్వాత కశింకోట పెద్ద గ్రామం. సుమారు 20 వేల జనాభా కలిగి ఉంది. నాలుగు పెద్ద రక్షిత మంచినీటి పథకాలు, మూడు చిన్న పథకాలున్నాయి. వీటి సామర్థ్యం సుమారు 11 లక్షల లీటర్లు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా ఇచ్చిన ఇంటింటి కుళాయిలు 4 వేలు వరకు ఉన్నాయి. పబ్లిక్, ప్రైవేట్ సంస్థలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కుళాయిలు సుమారు 500 ఉన్నాయి. వీటి ద్వారా కుళాయి నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో అవి ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడట్లేదు. దీంతో తాగునీటి కొరత ప్రజలకు తప్పట్లేదు.

మంత్రి అమర్‌నాథ్ చొరవ

వీధి కుళాయిల్లో చాలా వరకు అలంకార ప్రాయంగా మారాయి. మరి కొన్ని వీధి కుళాయిల నుంచి సన్నని నీటి ధారలతో జనాలకు నిరీక్షణ తప్పనిసరవుతోంది. స్థానిక గవరపేట, కనకమహాలక్ష్మి వీధి, కస్పా వీధి, అఫీషియల్ కాలనీ, గోవిందరావు కాలనీ తదితర ప్రాంతల్లో కొన్ని కుళాయిల నుంచి నీరు సరిగా సరఫరా కావట్లేదు. కొందరు పాత్రల్లో నీరు సేకరించి పట్టుకోవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ ప్రాంతానికి వచ్చిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖామాత్యులు గుడివాడ అమర్‌నాథ్‌కు స్థానిక మహిళలు తమ గోడు వినిపించారు. దీంతో మంత్రి చొరవ తీసుకుని జల్ జీవన్ మిషన్‌లో రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా తాజాగా శారదా నదికి ఆవల రెండు బోర్లు వేశారు. అవసరమైతే మరో బోరు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.


కశింకోటలో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరు బోర్ల నుంచి అదనపు పైప్‌లైన్

ప్రస్తుతం వేసిన రెండు బోర్ల నుంచి అదనంగా పైపులైన్ ఏర్పాటు చేసి స్థానిక కోటదిబ్బ వద్దనున్న రక్షిత మంచినీటి పథకాలకు అనుసంధానించనున్నారు. దీనివల్ల నీటి సరఫరా మెరుగుపడనుంది. ఇంకా మిగిలిపోయిన సుమారు 500 ఇళ్లకు, మారుమూల ప్రాంతాల వారికి అదనపు పైపులైన్ వేసి ఇంటింటి కుళాయిలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన సర్వే పూర్తి చేసి, కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. సరిగా నీరు రాని పబ్లిక్ కుళాయిలకు అవకాశం మేరకు ప్రత్యామ్నాయ పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా గతంలో వేసిన ఇంటింటి కుళాయిల నుంచి ముందుగా నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే కశింకోటకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని అధికారులు చెప్తున్నారు.

చిన్న ధార వస్తోంది



కుళాయి నుంచి తక్కువగా ధార వస్తోంది. బిందెడు నీరు కావాలంటే చాలా సేపు నిల్చోవాల్సి వస్తోంది. అందరికి చాలినంత నీరు రాకపోవడంతో వంతుల వారీగా పట్టుకోవలసి వస్తోంది. చాలా కాలంగా ఇదే సమస్య ఉంది. ఇకనైనా నీటి సరఫరా మెరుగుపర్చి, నీటి కొరత నివారణకు చర్యలు తీసుకోవాలి.
– దాడి లక్ష్మి, కనకమహాలక్ష్మి వీధి, కశింకోట.

ఒక్కోసారి నీరుండదు



చాలాసార్లు కుళాయిల నుంచి అరకొరగా మాత్రమే నీరు వస్తుంది. ఒక్కోసారి ఆ మాత్రం కూడా నీరు రాదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కుళాయిల నుంచి నీటి సరఫరా మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు చేపడుతుండటం ఆనందంగా ఉంది. ఈ పనుల్ని పూర్తి చేస్తే, మా ఇబ్బందులు తీరతాయి.
– పాలవలస లక్ష్మి, గవరపేట వీధి, కశింకోట.

నీటి సరఫరాను మెరుగుపరుస్తాం

కశింకోటలో మంచి నీటి సరఫరాను మెరుగుర్చే చర్యలు చేపట్టాం. తాజాగా వేసిన రెండు బోర్ల నుంచి కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేసి కోట దిబ్బ ప్రాంతంలో ఉన్న రక్షిత మంచినీటి పథకాలకు అనుసంధానిస్తాం. దీంతో నీటి సరఫరా మరింత మెరుగవుతుంది. అవసరం మేరకు అదనంగా మరో బోరు వేసేందుకు ప్రతిపాదించాం. గతంలో నీటి సరఫరా ప్రాజెక్టు విభాగం ద్వారా ఇచ్చిన ఇంటింటి కుళాయిలకు సక్రమంగా నీటి సరఫరా జరిగేలా ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.
– పావని, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కశింకోట

రైతు సంక్షేమానికి నిరంతర కృషి

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్
- సొంత నిధులతో తగరంపూడి గ్రోయిన్ గేట్లకు మరమ్మతులు


తగరంపూడి గ్రోయిన్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని తగరంపూడి గ్రోయిన్ గేట్లను ఎత్తి దిగువన ఉన్న ఆయకట్టు భూములకు శారదానదిలో సాగునీటిని విడుదల చేశారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఇటీవల పలు గ్రోయిన్లను పరిశీలించిన ఆయన ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం రైతుల సాగునీటి అవసరాల దృష్ట్యా తన సొంత నిధులతో అత్యవసరంగా తగరంపూడి గ్రోయిన్ గేట్లకు మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు అవసరాల కోసం నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రోయిన్ల గేట్లు శిథిలం కావడంతో నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతోందన్నారు. దీనికి శాశ్వత మరమ్మతుల కోసం సమగ్రమైన ప్రతిపాదనలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే గ్రోయిన్ల మరమ్మతు పనులకు నిధులు విడుదల అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రత్నాకర్‌ను శాలువాలతో సత్కరించారు. తమకు అండగా ఉన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నాయకులు నడిమిపల్లి కాశీబాబు, పాతలపాటి సురేష్‌బాబు, రవిరాజ్, పాకలపాటి రాజబాబు, బొడ్డపాటి చినరాజారావు, యాదగిరి రామచంద్రరావు, యన్నంశెట్టి శ్రీనివాసరావు, దాడి గణేష్, బోయిన రమణ, ఇంటి త్రినాథ్, మందారపు కుమార్, నమ్మి శ్రీను, ఉండ్రాల కన్నారావు, బుద్ధ శివనాయుడు, సాలారపు నాగేంద్రబాబు, కర్రి బాబూరావు, బోయిన శ్రీను, లెక్కల నాయుడు, రైతులు పాల్గొన్నారు

నూకాంబిక అమ్మవారికి వారపు పొద్దు పూజలు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారపు పొద్దు, ఉద్యోగులు, విద్యార్థులకు సెలవు రోజు కావడంతో అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పూలమాలలు, చీరలు, రవికెలు, అరటి గెలలు, తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కొందరు అమ్మ వారి జాతర జరిపి, అన్న సమారాధనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా అష్ట లక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటైన విగ్రహాలకు రంగులు వేసి, తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. వీటి ఏర్పాటుతో ఆలయం మరింత శోభాయమానం కానుందని భక్తులు భావిస్తున్నారు.


కశింకోటలో నూకాంబిక అమ్మ వారిని పెద్ద పూలమాలతో అలంకరించి నిర్వహిస్తున్న పూజలు

ఘనంగా సత్తెమ్మతల్లి ఉత్సవం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద కొండపై వెలసిన సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. చీర, రవిక, పండ్లు వగైరా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


తాళ్లపాలెంలో సత్తెమ్మ తల్లికి పూజలు

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం


కశింకోటలో 1990 బ్యాచ్ పోలీసుల ఆత్మీయ కలయిక

కశింకోట: కశింకోటలో పోలీసుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. సుమారు 33 ఏళ్ల స్నేహ మాధుర్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. 1990 బ్యాచ్‌లో ఉద్యోగంలో చేరిన జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుళ్లు స్థానిక పీఏసీఎస్ వద్ద ఉన్న విల్లాలో సమావేశమయ్యారు.

ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, శిక్షణ సమయంలో తమ పరిచయాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణ, అనారోగ్యం తదితర కారణాల వల్ల మృతి చెందిన పోలీసు సోదరులకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ విషయాల గురించి పరస్పరం తెలుసుకున్నారు. సహ పంక్తి భోజనం చేశారు. అంతా కలిసి ఫోటోలు దిగారు. ఆట పాటలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, అనిల్, సుబ్బారాజు, సాయి, ముబారక్, బోని శ్రీనివాసరావు, రఘు, శంకరరావు, నాయుడు, నరసింగరావు, వాసు భీశెట్టి వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, పూర్ణ, అనంత్ హాజరయ్యారు.

మహిళా పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట: హింసపై మహిళ పోరు యాత్ర కార్యక్రమం ముగింపులో భాగంగా ఈ నెల 8న విజయవాడలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం కశింకోటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 28 నుంచి హింసపై మహిళల పోరు యాత్ర ప్రచార జాతా నిర్వహించినట్టు తెలిపారు. ఈ యాత్ర ముగింపులో భాగంగా విజయవాడలోని జింఖానా మైదానంలో బహిరంగ సభ జరగనుందన్నారు. సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు జి.అమ్మాజీ, ఎం.తారక, కె.చినఅప్పలనరస, ఆర్.యశోద, ఇ.మహాలక్ష్మి, వై.ఆదియమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.


హింసపై మహిళా పోరు యాత్ర బహిరంగ సభ పోస్టర్ల ప్రదర్శన

మీనామృతం పంటలకు బలమైన టానిక్

ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న


కుంచంగిలో మీనామృతం తయారీ, ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: మీనామృతం(చేప ద్రావణం) అన్ని పంటలకు బలమైన టానిక్‌లా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న అన్నారు. మండలంలోని కుంచంగి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మీనామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనినే ఫిష్ ఎమినో యాసిడ్ అంటారని, ఇది మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు భూసారాన్ని పెంపొందిస్తుందన్నారు. మీనామృతం తయారీకోసం కేజీ నల్ల బెల్లం, లీటరు నీరు, కేజీ చేప వ్యర్థాలు సరిపోతాయన్నారు. వీటిని 27 రోజులు నిల్వ ఉంచితే మీనామృతం తయారవుతుందన్నారు. ఇది 6 నెలలు నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. పంట దిగుబడుల నాణ్యత కూడా చాలా బాగుంటుందన్నారు. మొక్కల పెరుగుదల దశలో దీనిని వినియోగించాలన్నారు. రైతులంతా రసాయన ఎరువుల వినియోగాన్ని వదిలి, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో కరణం వెంకటరమణ, సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి, పల్లెల నాగేశ్వరావు, వరాహవెంకటలక్ష్మి, సత్యారావు, కె.కుమారి, వీరవతి, హేమలత పాల్గొన్నారు.

'పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలి'

అనకాపల్లి రూరల్: జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక భవనంలో జరిగిన డీవైఎఫ్‌ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో విద్యార్హతలను బట్టి స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో 12 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సీహెచ్ శివాజీ, కార్యదర్శిగా ఎస్‌వీ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షునిగా అల్లు రాజు, సహాయ కార్యదర్శులుగా ఎస్.నారాయణరావు, శివలు ఎన్నికయ్యారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


జార్జిక్లబ్‌లో స్నేహితుల దినోత్సవంలో భారత స్వాభిమాన్ ట్రస్టు


గాంధీనగరం వసతి గృహంలో కేక్ కట్ చేస్తున్న భాగ్యలక్ష్మి


ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు అందిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: మంచి ఆరోగ్యంతోనే జీవిత కాలం మిత్రులతో ఆనందంగా గడపగలమని, అందుకు యోగా సాధన ఎంతగానో దోహదపడుతుందని భారత స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ, స్నేహబంధాన్ని కొనసాగించాలని కోరారు. అంతకు ముందు స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి సభ్యులకు అందించారు. కార్యక్రమంలో యోగా గురువు మాదేటి జనార్దన్, క్లబ్ సభ్యులు కొణతాల పెద్ద, బీఎస్‌ఎంకె జోగినాయుడు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో..

స్థానిక గాంధీనగరం బీసీ వసతిగృహంలో అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం జరిగింది. సంఘ సేవకులు గంగలకుర్తి భాగ్యలక్ష్మి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ, సేవాసంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో..

స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆదివారం బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నరసింగరావు, క్లబ్ చైర్మన్ పీఎస్ అప్పారావు, క్లబ్ అధ్యక్షుడు బీఎస్‌ఎంకె జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బుద్ద శివ, సభ్యులు పాల్గొన్నారు.

– స్థానిక మహాత్మ జ్యోతీరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మహేంద్రనాథ్ పట్నాయక్, వ్యాయామ అధ్యాపకులు మదన్మోహన్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ పాల్గొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్ ఆవరణలో, ఎలిమెంటరీ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది.

తుమ్మపాల: స్నేహితుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ నూకాంబిక దేవాలయం వద్ద కర్రి జగన్నాథం ఫంక్షన్ హాల్లో గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ 1991–92 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం అట్టహాసంగా జరిగింది. వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 150 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. సుమారు 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, ఆత్మీయంగా పలకరించుకున్నారు. గుండె సంబంధిత సమస్యతో ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం పాలైన వారి మిత్రుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు సాయం చేశారు.


సత్యనారాయణస్వామి ఆలయం వద్ద శారదానది వాకర్స్ క్లబ్ సభ్యులు

స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టె, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పూర్వ విద్యార్థులకు సాయం చేసేందుకు తన వంతుగా సూరిశెట్టి గణేష్ రూ.50 వేల నగదును ప్రకటించారు. కార్యక్రమంలో కాండ్రేగుల జగన్నాథరావు, కర్రి గంగాధర్, కట్ట సాయి, కొణతాల అప్పలరాజు, కోరిబిల్లి రమేష్, బుద్ధ భోగలింగేశ్వరరావు, కృష్ణంరాజు, కర్రి రామ వెంకట జగన్నాథరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

- శారదానది వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి ఆలయం వద్ద క్లబ్ సభ్యులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వనసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.


ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ఎంజీహెచ్ హైస్కూల్ 1991-92 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజయం సాధించిన న్యాయమూర్తి శివకిరణ్ జట్టు

అనకాపల్లిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్‌లు అన్నారు. మండలంలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల క్రీడామైదానంలో అనకాపల్లి జిల్లా న్యాయస్థానం అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మధ్య 76వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో న్యాయమూర్తి శివకిరణ్ జట్టు విజయం సాధించింది. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో తుది విజేతలకు ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవ సభలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలక్ష్మణ్, కార్యదర్శి సోరా శ్రీనివాసరావు వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి ఈశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.